# తిమింగిలం

## శ్రీ 'భైరవయ్య'

బెజవాడలో పార్కులో ఒక మూలగా, తలలు కత్తిరించబడ్డ క్రోటను మొక్కలమధ్య, నిలవెత్తు సిమెంటు ఆసనంమీద, నిలువుగా కర్రచేత పట్టుకుని నవ్వుతూ నిటారుగా నిలబడ్డాడు గాంధీ మహాత్ముడు.

కింద, ఆయన పాదాలకి పునాదిగా నిలబడ్డ సిమెంటు చప్టా చెంత నిశ్శబ్దంగా కేకలు. చేతుల కదలికలు. కాగితాల రెపరెపలు. గలగలలు. ముక్కలు స్థలాలు మార్చుకుంటున్నాయి. ఆ పేకముక్కల మీద వీరభద్రం చేతులు. చేతివేళ్లు అద్భుతంగా లాస్యం చేస్తున్నాయి. అయిదుగురు మనుషులు వీరభద్రం చేతి వేళ్ల తాండవం కేసి, మెరుపుల్లా కదులుతున్న మూడుముక్కలకేసి ఆత్రంగా చూస్తున్నారు. అందులో ఇద్దరుమటుకు నిర్లక్ష్యంగా వున్నారు. వాళ్ల ఆట కూడా అలాగే వుంది. వాళ్లిద్దరికీ డబ్బొస్తోంది. పోతోంది. మిగతా ముగ్గురికీ డబ్బొస్తోంది. కానీ వచ్చినట్టే వచ్చి వడ్డీ తీసుకు మరీ పోతోంది. కరువుదేశంలో వాన లొచ్చినట్టే వచ్చి వరదలై, పండిన పిసరంతపంటను కూడా తీసుకుపోయినట్టు.

వీరభద్రం కళ్లు అలసటగా వున్నాయి. అలవాటు కొద్దీ వేళ్లు ఇటూ అటూ చిందులు తొక్కుతున్నాయి. కానీ-

వాచీ చూసుకున్నాడు: ఒంటిగంట. ఇంక మూడు నాలుగుగంటలుంది రైలుకి. ఈ లోపుని పదిహేనువందల రూపాయలు సంపాయించాలి. అంటే కనీసం మూడువేల బేరం తగలాలి. అందుకనే ఈపార్కు ఎన్నుకున్నాడు. కానీ గంటన్నరైనా ఏదీ పెద్ద బేరం తగల్లేదు. అన్నీ చచ్చుబేరాలు. పదీపరకా బేరాలు. వీటితో ఎన్నటికి మూడువేలుకాను.

మూడువేలొస్తే సగమైనా షావుకారి కివ్వాలి. అది ఎగ్గొడితే - ఆ ఆలోచన రాగానే వీరభద్రం మెదడులో భైరవుడు తాండవం చేసాడు. ఒళ్లంతా చెమటలు పట్టాయి. ఆ పని వీరభద్రం చేసి తప్పించుకుపోలేడు. క్షణాల మీద షావుకారుకి తెలుస్తుంది. వీరభద్రంజీవితాంతం జైలునుంచి రోడ్డు మీదికి, రోడ్డు మీంచి జైల్లోకి పచార్లుచేస్తూ వుండాలి. పెండ్యులమ్ లాగ. వీరభద్రం పెళ్లీడుకొచ్చిన చెల్లెలు చర్మవ్యాపారసంస్థ నూతన సభ్యురాలేనా అవుతుంది. లేదా ఆత్మహత్య చేసుకుని చిక్కువిడని పోలీసు కేసన్నా అవుతుంది. తన సంపాదన ఈ రకమైందని తెలిస్తే గుడ్డితల్లి గుండె పగిలి పోతుంది. అందుకని వీరభద్రం ఆ పని చెయ్యడు. ఆ ఆలోచన రానివ్వడు. వచ్చినా దాన్ని దాచేసి, మెడపట్టి బైటికి గెంటబడ్డ సేల్సుమన్‌లా చిరునవ్వు నవ్వేస్తాడు

ఆలోచనల్లో పడ్డ వీరభద్రం రెండుమాట్లు డబ్బు లివ్వవలసొచ్చింది. విసుక్కుని జాగ్రత్తగా ఆడటం మొదలుపెట్టాడు. ఇంకో అరగంట సేపు ఆడాడు. అరమిల్లీ మీటరు దూరం కూడా లాభం జరగలేదు.

అలవాటుగా వీరభద్రం ఇటూ అటూ చూస్తున్నాడు.

వెంకట్రామయ్య చెట్టు నీడకి పార్కులోకి వచ్చి కూర్చున్నాడు. గాంధీ విగ్రహం కింద జరుగుతున్న పవిత్ర కార్యాన్ని చూస్తున్నాడు. ఛ, ఛ! అనుకున్నాడు. ఒకసారి రొంటిని తడివి చూసుకున్నాడు. ఎత్తుగా ఒత్తుగా వుంది.

వీరభద్రం ఓరగా చూసాడు. ఆడుతున్న అయిదుగురిలో ఇద్దరికి కన్ను గీటాడు. ఆట మంచి

జోరుగా సాగుతోంది. వీరభద్రం జేబులోంచి నోట్లు పరిగెడుతున్నాయి.

వెంకట్రామయ్య తనకేమీ పట్టనట్టుగా కూర్చున్నాడు. వెంకట్రామయ్య మామూలు మానవుడు.

ఎడ్లని కొనుక్కుందామని పక్క ఊరినుంచి వచ్చాడు. రెండుజతలు కావాలి. తనకూడా ఒకజత తెమ్మనమని పక్కింటి సుబ్బయ్య కూడా డబ్బిచ్చాడు. రొంటిని నాలుగు వేలున్నాయి. మంచిఎడ్లని చూసాడు. ఆ ఆసామీ అయిదువేలకి తక్కు విమ్మనన్నాడు. ఎంత బతిమాలినా కుదిరిందికాదు. పూరెళ్లి పట్టుకొస్తానని మరెవరితోటీ బేరం పెట్టుకోవద్దని చెప్పి బయల్దేరాడు. ఎండ తీవ్రంగా వుంటే వచ్చి పార్కులో కూర్చున్నాడు.

వీరభద్రం హుషారుగా ఆడుతున్నాడు. గడిలో పుంజులా వున్నాడు. నోట్లు నవ్వుతూ పంచిపెడుతున్నాడు.

వెంకట్రామయ్య సగం కళ్లు మూసుకుని చూస్తున్నాడు. ఊరింకా అయిదు మైళ్లుంది. ఈ ఎండలో నడవడమంటే చిరాగ్గా వుంది. ఓపిక లేదు. పదింటికి హోటల్లో ఇడ్లీ తిన్నాడు. ఆకలిగా కూడా వుంది. వీరభద్రం ఉదారంగా పంచిపెడుతున్న నోట్లకేసి చూస్తున్నాడు. తనక్కావలసింది వెయ్యి రూపాయలు. ఈ పాటికి వీరభద్రం పదిహేను వందలు పంచిపెట్టుంటాడు.

వెంకట్రామయ్య చెట్టు చాటుకి వెళ్లాడు. కొంతసేపటికి బయటికొచ్చి ఆడుతున్న వాళ్ల దగ్గర నిలబడ్డాడు. ఆట చాలా సులభంగా వుంది.

వెంకట్రామయ్య చిన్నపందెం కాసాడు. పోయింది. మళ్లీ వేసాడు. రెట్టింపొచ్చింది. వెంకట్రామయ్య ఆడుతున్నాడు. డబ్బొస్తోంది పోతోంది. పందెం పెరుగుతోంది.

కొంతసేపటికి ముగ్గురు పందెం కాయలేక బీడీ వెలిగించుకుని వెళ్లిపోయారు.

వెంకట్రామయ్య వంద రూపాయలు కాసాడు. రెండువంద లొచ్చింది. రెండు వందలు కాసాడు నాలుగొందలొచ్చింది.

మిగతా ఇద్దరూ కూడా ఆడటం మానేసారు.

వెంకట్రామయ్య బొమ్మరవిూసాల్ని మెలిపెట్టుకుంటున్నాడు.

వీరభద్రం చేతులు తడబడుతున్నాయి.

వెంకట్రామయ్య నాలుగొందలు కాసాడు. ఎనిమిది వందలొచ్చింది.

వెంకట్రామయ్య కళ్లు సంతోషంతో తూలుతున్నాయి. వీరభద్రానికి భయం పట్టుకుంది. ముక్కల్ని జాగ్రత్తగా చూసాడు. అవే ముక్కలు.

రూపాయికి మూడు రూపాయలు పందెం.

వెంకట్రామయ్య నాలుగొందలు పందెం కాసాడు. వీరభద్రం జేబులో వేసుకున్నాడు.

వెంకట్రామయ్యకి కోపమొచ్చింది. అయిదు వందలు కాసాడు. ఉహూం... ఈసారి వంద కాసాడు. మూడొందలొచ్చింది. అయిదు వందలు కాసాడు. పదిహేనువంద లొచ్చింది.

వెంకట్రామయ్య బాసీపట్టు వేసుకూర్చున్నాడు. మంచి పట్టులో వున్నాడు. ఉడుంలా కూర్చున్నాడు.

వీరభద్రం వణుకుతున్నాడు. 'డబ్బిలాపోతే తన చెల్లెలి గతి—డబ్బులేకపోతే తన పరువు—'

వీరభద్రం పేకముక్కలకి దణ్ణం పెట్టాడు.

మిగతా ఇద్దరూ 'కాయండి బాబూ—ఇందాక ట్నించీడు మూడువేలు సంపాయించాడు. మీరొచ్చాక ఆడి దశ తిరిగినట్టుంది. కాయండి బాబూ—పెద్దది కాయండి—అన్నారు వెంకట్రామయ్యతో.

బొమ్మరవిూసాలు తళుకులు చూపాయి.

వీరభద్రం చేతిలో పేకముక్కలు—

ముక్కలు ఇటూ అటూ మారాయి.

వెంకట్రామయ్య వెయ్యి రూపాయలు కాసాడు. మరో వెయ్యి.

పందెం రూపాయికి నాలుగు పెరిగింది. వీరభద్రం చేతులు వెచ్చగా వున్నాయి. అరచేతులు చరుచుకుని ముక్కలు పరిచాడు. వెంకట్రామయ్య బొమ్మరవిూసం సవరించుకుని 'రావే నీయమ్మాల' అని తిట్టి 'ఎయ్యి' అన్నాడు.

పందెం పెరుగుతోంది. తగ్గుతోంది.

వీరభద్రం తిన్నగా కూర్చోలేకపోతున్నాడు. వెంకట్రామయ్య కదల్లేకపోతున్నాడు.

నిమిషాలు దొర్లుతున్నాయి. అంతకన్నా ముందుగా నోట్లు పరిగెడుతున్నాయి.

వెంకట్రామయ్య తూలుతున్నాడు. అప్పుడే కాలవలో మునిగొచ్చినట్టుగా వున్నాడు.

'బాబూ భయపడకండి. ఆఖరు పందెం. కాయండి. పందెం పెద్దది చేద్దాం. ఏయ్ రూపాయికి పది. పందెం కాసుకోసే. వుంటే వెయ్యండి బాబూ వెయ్యండి.' ఇద్దరూ వెంకట్రామయ్య భుజం తడుతున్నారు

వెంకట్రామయ్య గాంధిగారికిబిళ్ళంపెట్టాడు. అభిమన్యుడిలా పందెం కాసాడు.

వెంకట్రామయ్య లబోదిబో మన్నాడు. అన్యాయమన్నాడు.

వీరభద్రం నోట్లు లెక్కించుకుంటున్నాడు.

గాంధిగారు పుట్టిన భూమిలో ఇది ద్రోహ మన్నాడు. గాంధిగారి ముఖం చూసి, నిజం చెప్ప మన్నాడు. ఇందులో మోసం లేదా లన్నాడు. నువ్వు ముక్కలు మార్చలేదా' అన్నాడు వీరభద్రాన్ని. ఇద్దరిలో ఒకడు వెంకట్రామయ్యని సపోర్టు చేసాడు, వెనకాల నుంచుని.

వీరభద్రం నోట్లు బొత్తిపెట్టి జేబులో పెట్టుకున్నాడు. లేస్తున్నాడు. వెంకట్రామయ్య కాలరు పట్టుకున్నాడు.

వెంకట్రామయ్యకి కళ్లు బైర్లుకమ్మాయి. తల పట్టుకుని సిమెంటు చప్టా మీద పడ్డాడు. ఎక్కడున్నాడో మర్చిపోయాడు.

వీరభద్రం సిగరెట్టు వెలిగించుకున్నాడు. నోరంతా ఎండిపోయింది.

మిత్రు లిద్దరికీ వాటా యిచ్చి పార్కు బయటికి నడిచాడు. పార్కు బయట పహరా యిస్తున్న ఎర్రటోపీ,వీరభద్రం ఇచ్చిన సిగరెట్టు ముట్టించుకుని కాగితాలుమడతబెట్టి జేబులో పడేసి పొగొదులుకుంటూ వెళ్లిపోయింది.

వీరభద్రం షావుకారింటి నుంచి వస్తున్నాడు. అప్పుడే చేసిన బందరు తూటాలా వున్నాడు. టైము చూసుకున్నాడు.నాలుగున్నర రైలుకింకా ఇరవై నిమిషాలుంది. వెళ్లగలడు.

ఇంట్లో అందరూ ఎదురు చూస్తుంటారు. ముఖ్యంగా చెల్లెలైతేను చూస్తుంటుంది. తెల్లార గట్ల చెల్లెలికి అందరి లాగే ఘనంగా పెళ్లి చెయ్య బోతున్నాడు. పెళ్లికొడుకు కలెక్టరాఫీసులో గుమాస్తా. ఎంతో కష్టపడి వెతికి సంబంధాన్ని కుదిర్చాడు. కట్నం వెయ్యి రూపాయలు.

'తన చెల్లెలు అదృష్టవంతురాలు' అను కున్నాడు వీరభద్రం. సొమ్ము సమకూడటం కష్టం అనుకున్నాడు. అనుకున్న దానికన్నా ఎక్కువే వచ్చింది. షావుకారు కూడా అయిదువందలిచ్చాడు.

వీరభద్రం తొందరగా నడుస్తున్నాడు.

అతని తండ్రి అతను స్కూలు ఫైనలు చదువుతున్నప్పుడు పోయాడు. తల్లికి ఏదో వాతం కమ్మి అతనికి తెలియనప్పుడే కళ్లుపోయాయి.

వీరభద్రానికి సంతోషంగా వుంది. ఇంత కాలానికి తండ్రికిచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాడు.

చెల్లెలికి పెళ్లయ్యాక వీరభద్రం ఆలోచనలు చాలా వున్నాయి.

'ముఖ్యంగా ఈ జీవితానికి స్వస్తి చెప్పి కొత్త జీవితం ప్రారంభించా లనుకున్నాడు. తెలిసినొకాయన నిజాం దేశంలో ఉద్యోగ మిప్పిస్తానన్నాడు. తల్లిని తీసుకుని అక్కడికి వెళ్లిపోవాలి. ఆ తరవాత జీవితంలో స్థిరపడాలి.

హుషారుగా ఈల వేస్తున్నాడు వీరభద్రం. స్టేషను దగ్గరోనే వుంది.

స్కూళ్ల నించి పిల్లలు తిరిగి వస్తున్నారు.

మళ్లీ ఏటికి తను మేనమామవుతాడు. తనలో తనే నవ్వుకున్నాడు.

వీరభద్రం రోడ్డు దాటుతున్నాడు. అవతలి వేపు నుంచి ఆరేళ్ల కుర్రాడు పుస్తకాల సంచీ పది

లంగా పట్టుకుని వస్తున్నాడు. కుర్రాడు ముద్దుగా వున్నాడు.

'తన చెల్లెలికి ఇలాంటి కొడుకు పుడితే బావుణ్ణు'' అనుకున్నాడు.

వీరభద్రం ఊరు చేరుకున్నాడు. వేకువజామునే ముహూర్తం. వెనకాల బండిలో పెళ్ళి వారు వస్తున్నారు. తొందరగా ఇంటికి నడిచాడు.

వీరభద్రం ఆశ్చర్యంగా చూసాడు. పెళ్ళి పందిరిలో ఏమీ హడావుడి లేదు. అందరూ వీరభద్రం కేసి జాలిగా చూస్తున్నారు. విషాదంగా చూస్తున్నారు. ఎవరూ మాట్లాడటంలేదు.

వీరభద్రం అడుగులు తడబడ్డాయి. బెదురుగా పందిట్లో అడుగుపెట్టాడు. దొంగలా లోపలికి నడిచాడు. తల్లి నడవలో గుడ్లల్లో నీళ్ళు కుక్కుకుంటోంది. వీరభద్రం అడుగుల చప్పుడు వింది.

'ఒరేయ్ ఈరబద్రం కొంప ముంచేసిందిరోయ్' అంటూ గావుకేక పెట్టింది. ఇద్దరాడంగులు ఆవిణ్ణి పట్టుకున్నారు.

వీరభద్రం తిమిరెక్కిన వాడిలా నుంచున్నాడు. అందరి కేసి అయోమయంగా పిచ్చిగా చూసాడు.

'అది...నీ చెల్లెలు...సోడా కొట్టు సుబ్బడితో లేచిపోయింది' అన్నాడు వీరభద్రం మేనమామ.

పాపం వీరభద్రం....

సముద్రంలో తిమింగలం పెదిమెలు నాక్కుంది.

---

